నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం 18 మే 2023

వడ్లు దొంగతనం చేస్తున్న దుండగులను పట్టుకున్న రైతులు



దుండగుల చేతులు కట్టేసిన రైతులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ పరిధిలోని దేవుని పల్లి గ్రామం నుండి మిస్సంపల్లి వెళ్లే మార్గ మధ్యంలో గల వడ్ల కేంద్రాల వద్ద నుండి, లారీల నుండి వడ్లను దొంగలిస్తున్న ఇద్దరి వ్యక్తులను పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులు కు పట్టించినట్లు స్థానిక రైతులు తెలిపారు. స్థానిక రైతులు తెలిపినా వివరాల ప్రకారం మూడు నాలుగు రోజులుగా కేంద్రాల వద్ద వడ్లు చోరీకి గురవుతుండటంతో రైతులు నిఘా పెట్టగా ఇద్దరు వ్యక్తులు ఆటోలో వచ్చి దొంగతనానికి పాల్పడుతుండగా చూసిన రైతులు పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

పాలిసెట్ పరీక్ష ప్రశాంతం



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పాలిసెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీరామ్ తెలిపారు. పాలిసెట్ 2023 పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 5856 మంది విద్యార్థులు పరీక్ష నిర్వహించగా 5,510 మంది విద్యార్థులు హాజరైనట్టు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీరామ్ తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో 16 కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాసినట్టు తెలిపారు. జయచంద్ర ఆధ్వర్యంలో పర్యవేక్షణ నిర్వహించారని ప్రిన్సిపాల్ తెలిపారు. పాలిసెట్‌కు సహకరించిన రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, విద్య, వైద్య, ఆర్టీసీ శాఖలకు పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ శ్రీరామ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఓన్లీ క్యాష్



- ప్రయివేటు ఆసుపత్రుల్లో ఫోన్‌పే, గూగుల్ పే బంద్
- చిత్తు కాగితాలపై వేల రూపాయల బిల్లు
- నిబంధనలకు బేఖాతరు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రయివేటు ఆసుపత్రులు ఆదాయపు పన్నుకు ఎగనామం పెట్టే చర్యలకు పూనుకుంటున్నాయి. ఈ రోజుల్లో కూరగాయల అమ్మేవాళ్లు సైతం ఫోన్‌పే, గూగుల్ పే చెల్లింపులకు సహకరిస్తుండగా.. వేలాది రూపాయలు బిల్లులు చెల్లించుకునే ఆసుపత్రులు మాత్రం 'ఓన్లీ క్యాష్' అంటూ రోగులకు ముప్పతిప్పలు పెడుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు వచ్చే రోగులకు, రోగి బంధువులకు ఈ క్యాష్ చెల్లింపు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇన్‌పేషెంట్ చిట్టీతో సహా మెడికల్ బిల్లులన్నింటికి క్యాష్ కావాలని ఒత్తిడి చేస్తున్నారు. ఐపీ చిట్టీ రాయిస్తేగానీ చికిత్స ప్రారంభించడం లేదు. దీంతో రోగులుకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఓ వైపు ఆన్‌లైన్ లావాదేవీలు చేయాలని కేంద్ర ప్రభుత్వం మొత్తుకుంటుంటే ఇందుకు విరుద్ధంగా జిల్లాలో ఆసుపత్రులు వ్యవహరిస్తున్నాయి.

నిజామాబాద్ జిల్లా మెడికల్ హబ్‌గా మారింది. వివిధ రకాలకు సంబంధించిన వ్యాధులకు జిల్లా కేంద్రంలోనే ప్రత్యేక ఆస్పత్రులు వెలిశాయి. జిల్లా నలుమూలులతో పాటు నాందేడ్ పరిసర ప్రాంతాల నుంచి కూడా చికిత్సకు జిల్లాకు వస్తున్నారు. జిల్లాలో చిన్నచితకా అన్ని కలిపి సుమారు 500 వరకు ఆసుపత్రులు న్నాయి. అయితే కొన్ని ఆస్పత్రులు కేవలం క్యాష్ చెల్లింపులే చేయాలని ఒత్తిడి చేస్తున్నాయి. ఇందులో ముఖ్యంగా మల్టీస్పెషల్టీ ఆసుపత్రులు కొన్ని క్యాష్ చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నాయి. చివరకు కార్డు చెల్లింపులకు కూడా ఒప్పుకోవడం లేదు. ఒకవేళ కార్డు ద్వారా బిల్లు చెల్లించే రోగుల నుంచి బిల్లు చెల్లింపుపై అదనంగా 2.5 శాతం పేర పన్ను వసూలు చేస్తున్నారు. దిక్కుతోచని స్థితిలో అదనపు చెల్లింపులు కూడా చేస్తున్నారు.

ఆదాయ పన్ను నుంచి తప్పించుకోవడానికే?

ఫోన్‌పే, గూగుల్ పే, డెబిట్ కార్డు ద్వారా చెల్లింపులు చేస్తే అవి నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి. ఆర్థిక సంవత్సరం ముగింపులో ఇవన్నీ లెక్కలు చూపాలి. ఆ మొత్తం చెల్లింపులకు ప్రభుత్వానికి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ప్రభుత్వ నిఘా నుంచి తప్పించుకోవడానికి ఎత్తుగడగా డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. సాధారణంగా వెయ్యి రూపాయల వస్తువు కొనుగోలు చేసినా జీఎస్టీ బిల్లు ఇచ్చే పరిస్థితుల్లో... వేలాది రూపాయలను ఆసుపత్రి బిల్లుగా చెల్లించినా ఒరిజినల్ బిల్లు ఇవ్వడం లేదు. కేవలం చిత్తుప్రతిపై బిల్లు రాసి చెల్లించాలని రోగులకు చెబుతున్నారు.

బిల్లుపై అవగాహనకు కౌన్సెలర్లు..

జిల్లాలోని ప్రయివేటు ఆసుపత్రుల్లో కొత్త ట్రెండ్ మొదలయ్యింది. ఇప్పటికే మార్కెట్ ఎగ్జిక్యూటివ్‌లను నియమించి వైద్యాన్ని పూర్తిగా కమర్షియల్‌గా మార్చిన వైనం మరవకముందే.. రోగులకు బిల్లులపై అవగాహన కల్పించేందుకు కౌన్సెలర్లను నియమించారు. సాధారణంగా ఉన్నత చదువులపై అవగాహనకు, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించేందుకు కౌన్సెలర్లు ఉంటారు. కానీ ప్రయివేటు ఆసుపత్రుల్లో కొత్తగా కౌన్సెలర్లు వచ్చారు. వీరు రోగికి ఏదైనా శస్త్రచికిత్స అయితే ఎంత బిల్లు అవుతుంది? అడ్వాన్స్‌గా ఎంత చెల్లించాలి? మెడికల్ బిల్లులు ఎంత అవుతాయి? తదితర విషయాలు ముందుగా చెప్పి రోగి తరపు బంధువులను మొత్తం బిల్లు చెల్లించేలా మానసికంగా సిద్ధం చేస్తున్నారు. డిశ్చార్జి సమయంలో రోగి బంధువులు ఇంత బిల్లు ఎందుకు వేశారు? అని అడగకుండా 'ముందుగానే అన్నీ చెప్పాం కదా' అనే మాటను ముందుకు తీసుకొస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్వి రమ

మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం, పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

మధ్యాహ్న భోజన కార్మికుల గౌరవ వేతనం పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వి రమ డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా విస్తృత సమావేశం నాందేవ్‌వాడలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి మాజరై మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన 3000 రూపాయల గౌరవ వేతనం పెండింగ్ బడ్జెట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జిల్లాలో గత ఏడు నెలలుగా గుడ్లు, ఇతర బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో మధ్యాహ్న భోజన కార్మికులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని తెలిపారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. స్కూల్స్ ప్రారంభానికి ముందే అడ్వాన్సులుగా మధ్యాహ్న భోజన నిర్వహణకు నిధులు కేటాయించాలని అన్నారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, ఉపాధ్యక్షులు మల్యాల గోవర్ధన్, మధ్యాహ్న భోజనం యూనియన్ నాయకులు కొండ గంగాధర్, సుజాత, నిరంజన, బాలరాజు, శిరీష, సురేందర్ రెడ్డి, పర్వవ్వ, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల రక్షణకు నిరంతర పర్యవేక్షణ అవసరం

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు దేవయ్య



సమీక్షలో మాట్లాడుతున్న దేవయ్య

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

ఆడపిల్లలను విక్రయిస్తే కేసులు నమోదు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు అరికెళ్ల దేవయ్య అన్నారు. బుధవారం కామారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా బాలల సంరక్షణ యూనిట్, మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కులు, సంరక్షణ కోసం తీసుకోవలసిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కులను పరిరక్షించేందుకు అధికారులు కృషి చేయాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో పక్కాగా పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. సంరక్షణ కేంద్రాల్లో ఉంటున్న బాలల సంరక్షణ తల్లిదండ్రుల వలే అధికారులు చూసుకోవాలన్నారు. వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని పేర్కొన్నారు. ఐసిడిఎస్, పోలీస్, వైద్యశాఖ, బీసీ, ఎస్సీ, ఎస్టి, మైనారిటీ సంక్షేమ శాఖలు బాలల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను సమీక్ష చేపట్టారు. సమావేశంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అడిషనల్ ఎస్పీ అన్యోన్య, సిడబ్ల్యూసి చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, జిల్లా బాలల సంరక్షణ అధికారిని స్రవంతి, జిల్లా కార్మిక అధికారి సురేంద్ర కుమార్, జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్ సింగ్, సీడీపీవోలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

- యాదవ, కురుమ జేపసీ ఆధ్వర్యంలో ర్యాలీ, రాస్తారోకో



రాస్తారోకో చేపట్టి నినాదాలు చేస్తున్న కులసంఘాల నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

యాదవ కురుమలతో పాటు యావత్ తెలంగాణ రైతాంగం ఆత్మగౌరవం దెబ్బతినేలా టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని యాదవ కురుమ జేఏసి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం నిజామాబాద్ నగరంలోని ధర్నా చౌక్ లో ధర్నా చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాజారామ్ యాదవ్, యాదవ కురుమ జేఏసీ నాయకులు మాట్లాడుతూ దేశంలో నాగరికతకు వ్యవసాయమే మూల మని భారత దేశంలో వ్యవసాయాన్ని మొదట దున్నపోతులతోనే చేశారని దున్న పోతులు ,బర్రెలు, ఎద్దులు ఆవులు భారతీయ సంస్కృతిలో ఒక భాగమని తెలిపారు. దేశంలో యాదవులు పశుపాలన ద్వారా పాలు పెరుగు వెన్న నెయ్యి సమాజానికి అందించారని తెలిపారు. వ్యవసాయాన్ని మట్టిని పీడనొప్పించ పరచడం అంటే సమస్త శ్రామిక వర్గాన్ని ముఖ్యంగా రైతాంగాన్ని విమర్శించడ మేనని రేవంత్ రెడ్డి ఆత్మ విమర్శన చేసుకోవాలని అన్నారు. ఈనెల 24వ తేదీ లోపు రేవంత్ రెడ్డి యాదవులకు క్షమాపణ చెప్పాలని లేకుంటే తెలంగాణ రాష్ట్రంలోని యాదవ సైన్యం అంతా కదిలి గాంధీభవన్ ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్కు తీవ్ర అంతరాయమై రాకపోకలు స్తంభించాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ సంఘం నాయకులు కడారి అంజయ్య, గోస శ్రీనివాస్, యాదవ్ గోవర్ధన్, లాలు యాదవ్, యాదవ కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేక రాములు, యాదవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్వింటాకు ఐదు కిలోల కడ్తా

- తరుగు ఇస్తేనే దించుకుంటామని తేల్చిచెబుతున్న రైస్‌మిల్లర్‌లు
- వారం రోజులుగా రైస్‌మిల్ నుంచి కదలని లారీలు



రైస్‌మిల్ వద్ద నిలిచిన లారీలు

నవతెలంగాణ-ధర్పల్లి

కడ్తా పేరుతో కొర్రీలు పెట్టొద్దని ఎప్పటికప్పుడు ధాన్యం అన్‌లోడ్ చేసుకోవాలని ఒక వైపు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తున్నా రైస్‌మిల్లర్లు పెడచెవిన పెడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవ డంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. క్వింటాకు ఐదు కిలోల తరుగు ఇస్తేనే ధాన్యం దించుకుంటా మని తేల్చిచెబుతున్నారు. దీంతో లారీలు వారం పదిరోజులుగా రైస్‌మిల్లుల వద్దనే నిలిచి ఉంటు న్నాయి. ఇంత జరుగుతున్నా.. అధికారులు పర్యవేక్షణ చేపట్టడం లేదని, సమీక్షలకే పరిమిత మవుతూ క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ధాన్యం రైస్‌మిల్లుల వద్దకు వెళు తుండటంతో వారు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అకాలవర్షాలతో ఆగమైన రైతన్నల జీవితాలను రైస్‌మిల్లర్లు మరింత ఆగం చేసే పనిలో పడ్డట్టు విమర్శలు వ్యక్తమ వుతున్నాయి. తడవని ధాన్యానికి సైతం కొర్రీలు పెడుతూ దందా నడిచిన ప్పుడే దండు కుందామనే తీరుతో వ్యవహరి స్తున్నట్టు రైతులు ఆరోపిస్తు న్నారు. తాము మంచి వడ్లను పంపిం చామని సొసైటీ అధికారులు చెబుతున్నా పెడచెవిన పెడుతూ లారీలను వారం రోజులైన ఖాళీ చేసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. మ్యాచర్ రావడం లేదని, తడిసిన ధాన్యం అని, నూక అవుతుందని ఆయా కారణాలు చెప్పుతూ ప్రతి క్వింటాకు 5 కిలోల కడ్తా ఇస్తేనే దించుకుంటామని తేల్చిచె బుతున్నారు. లేదంటే దించుకోబోమని మొఖంపైనే చెప్పేస్తున్నారు. తామేమో రైతుల నుండి మంచి ధాన్యం మ్యాచర్ వేసి రైతులముందు కాంటాలు వేసి లారీల్లో నింపి ప్రభుత్వం అలాట్మెంట్ ఇచ్చిన రైస్మిల్లులకు పంపిస్తే రైమిల్లర్లు కడ్తా పేరుతో నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని హొన్నజిపేట్ సొసైటీ చైర్మన్ మ్యాడారం రాజేందర్ రెడ్డి వాపోయారు. అన్ని సక్రమంగా ఉన్నప్పటికీ 5 కిలోల కడతా అంటే దానికి ఎవరు సమాధానం చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. రైతులు అష్ట కష్టాలు పడి అకాలవర్షాలకు, కోతలు కోసి అన్నిరకాల జాగ్రత్తలు తీసుకొని కళ్ళల్లో 15,20 రోజుల తరబడి నిద్రాహారాలు మాని తీరా మ్యాచర్ వచ్చాక తూకాలు వేసి బ్యాగులను లారీల్లో ఎక్కించి ఊపిరి పీల్చుకుంటే, రైస్‌మిల్లర్‌ల దాటికి కడ్తా పేరుతో దోపిడీని అరికట్టలేకపోతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇలాంటి సమస్యలను పరిష్కరించాలని, అడ్డగోలు దోపిడీకి పాల్పడుతున్న రైస్‌మిల్లర్‌లపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కాంటా వేసి తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు

వ్యవ'సాయం'లో ఏఈఓలు క్రియాశీలం

- రైతుల ప్రయోజనాలు కాపాడటమే పరమావధిగా పనిచేయాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సమీక్ష

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలో సాగు రంగమే ప్రధాన ఆధారంగా ఉన్నందున వ్యవసాయ విస్తీర్ణ అధికారులు (ఏ.ఈ.ఓలు) క్రియాశీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. క్షేత్ర స్థాయిలో అనునిత్యం రైతులను కలుస్తూ, వారి ప్రయోజ నాలను కాపాడడమే పరమావధిగా పని చేయాలని హితవు పలికారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. మరో పక్షం రోజుల్లో ఖరీఫ్ పంటల సాగు ప్రారంభం కానున్న నేపథ్యంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, సిబ్బంది రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని అన్నారు. ముఖ్యంగా రైతులు వివిధ పంటలకు సంబంధించి నాణ్యతతో కూడిన విత్తనాలు ఎంపిక చేసుకునేలా చూడాలన్నారు. ఏ రకం పంటకు ఎలాంటి విత్తనాలు వేస్తే అధిక దిగుబడులు వస్తాయో వివరించాలన్నారు. నకిలీ విత్తనాలతో ఎక్కడ కూడా రైతులు నష్టపోకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఎరువుల విషయంలో రైతులు అనవసర ఆందోళనకు గురికాకుండా, వారి అవసరాలకు సరిపడా అందుబాటులో ఉన్నాయని వారికి స్పష్టమైన భరోసా కల్పించాలన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

ముఖ్యంగా యూరియా విషయంలో రైతుల్లో ఆదుర్దా నెలకొని ఉంటుందని, అయితే జిల్లా అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగానే ప్రణాళికాబద్ధంగా యూరియా ఎరువులను తెప్పిస్తు న్నామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 33 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందు బాటులో ఉన్నాయని, విడతల వారీగా మరిన్ని నిల్వలు వస్తాయని వివరించారు. రైతులు మోతాదు కు మించి ఎరువులు వాడకుండా చూడాలన్నారు. విత్తనాలు, ఎరువుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఖరీఫ్ సీజన్ ను విజయవంతంగా పూర్తి చేసుకోగలుగు తామని అన్నారు. ఏఈఓలు ప్రతిరోజూ రైతు వేదికలకు వెళ్లి అన్నదా తలతో సమావేశమై వారికి సాగు అంశాలపై అవగా హన కల్పించాలని ఆదేశిం చారు. శాఖలవారీగా దైనందిన కార్యక్రమా లను నిర్వహిస్తూనే, వారంలో కనీసం నాలుగు రోజులు రైతు వేదికల్లో రైతులతో భేటీలు నిర్వహించాలని సూచించారు. రైతుల కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, వివిధ పథకాల గురించి ప్రతి ఒక్కరికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈమేరకు ఏ.ఈ.ఓలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తు న్నారా? లేదా? అన్న విషయాన్ని నిశితంగా పరిశీలన జరుపుతామని కలెక్టర్ స్పష్టం చేశారు. మండల ప్రత్యేక అధికారుల ద్వారా ఏ.ఈ.ఓ. ల పనితీరుపై వారంవారం నివేదికలు తెప్పించుకుంటా మని అన్నారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు గుర్తిస్తే, వాటిని జిల్లా అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి నర్సింగ్ దాస్, ఏ.డీలు, ఏ.ఓలు, ఏ.ఈ.ఓలు పాల్గొన్నారు.

ఫైనల్‌లో ఆడనివ్వలే

సీఎం కప్ పోటీల్లో మంగళ్‌పాడ్ క్రీడాకారుల ఆవేదన



తమ ఆవేదన వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు

నవతెలంగాణ-ఎడపల్లి

తాము గెలిచినా.. ఫైనల్ పోటీలో తమను ఆడనివ్వకుండా.. ఒడిన జట్టుతో మ్యాచ్ జరిపించారని మండలంలోని మంగళ్‌పాడ్ క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలో సీఎం కప్ పోటీల్లో భాగంగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. అయితే సెమిఫైనల్‌లో మంగళ్‌పాడ్ జట్టు గెలవగా.. ఫైన్‌లో తలపడాల్సి ఉంది. బుధవారం మ్యాచ్ ఉండగా.. తమకు సరైన సమాచారం ఇవ్వలేదని, ఒడిన జట్టుతో ఫైనల్ ఆడించారని ఆరోపించారు. ఈ విషయమై చర్యలు తీసుకోవాలని ఎంపీపీకి, ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయం పీఈటీ జ్యోతిని వివరణ కోరగా.. సమయానికి రాలేకపోవడంతో వేరే జట్టుతో ఫైనల్ మ్యాచ్ ఆడించి నట్టు తెలిపారు.

కబడ్డీలో తమకు ఎక్కువ పాయింట్లు వచ్చినా ఓడిపోయినట్టు ప్రకటించారని బ్రాహ్మణపల్లి జట్టు సభ్యులు ఆరోపించారు. బ్రాహ్మణపల్లి-ఎడపల్లి మధ్య కబడ్డీ ఫైనల్ మ్యాచ్ నిర్వహించగా.. న్యాయనిర్ణేతలు ఎడపల్లి జట్టుకే మద్దతు పలికారని బ్రాహ్మణపల్లి జట్టు సభ్యులు ఆరోపించారు.

ఆస్తికోసమే తండ్రి హత్య

కొడుకు, కోడలితో పాటు మరొకరి రిమాండ్

వివరాలు వెల్లడించిన డీఎస్పీ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

ఆస్తి కోసం తండ్రిని హత్య చేసిన కేసులో కొడుకు, కోడలితో పాటు సహకరించిన మిత్రుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి నట్టు ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జాడే తుకారం(74)కు ముగ్గురు కూతుర్లు, ఒక కొడుకు. గతంలో వస్త్ర వ్యాపారంతో పాటు చిట్టీల వ్యాపారం చేస్తుంటాడు. ఆయన కొడుకు జాడే కిషోర్ హైదరాబాద్‌లో వ్యాపారం నిర్వహిస్తుంటాడు. ఆస్తి విషయంలో తండ్రికి, కొడుకుకు కొన్ని రోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. తండ్రిని హతమార్చి ఎలాగైనా ఆస్తి మొత్తం కాజేయాలని కిషోర్ పథకం పన్నాడు. దీంతో వెంటనే హైదరాబాద్ నుండి ఈ నెల 13వ తేదీన తన భార్య శిల్పను తీసుకొని కిషోర్.. ఎల్లారెడ్డి పట్టణంలోని తన చిన్ననాటి స్నేహితుడు గొల్లపల్లి రాజు ఇంటికి వచ్చారు. ముందస్తు ప్లాన్ ప్రకారం.. 14వ తేదీనా తండ్రి ఇంటికి కిషోర్ తన మిత్రుడు రాజు వెళ్లారు. తుకారామ్‌ను చేతులతో గుద్ది, కాళ్ల చేతులు కట్టేసి హత్య చేశారు. తర్వాత అక్కడి నుండి రాజు భయపడి వెళ్ళిపోయి తన ఇంట్లో గల కిషోర్ భార్య శిల్పను తీసుకొని మృతుడు ఇంటికి వచ్చాడు. సంఘటన స్థలంలో ఉన్న రక్తపు మరకలను శిల్ప తూడ్చి దుస్తులను కాల్చివేసింది. అనంతరం మృతుడు తుకారం పై గల 18 గ్రాముల బంగారం చైన్ 7 గ్రాముల బంగారు ఉంగరం 6 గ్రాముల మరో బంగారు ఉంగరం మొత్తం 31 గ్రాముల బంగారం తీసుకుని అక్కడ నుండి వెళ్లిపోయారు. మృతుడి కూతుర్ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బుధవారం ఉదయం 5.30 గటల సమయంలో ఎల్లారెడ్డి లోని అంబేడ్కర్ చౌక్ వద్ద నిందితులను పట్టుకొని విచారించగా.. నేరం అంగీకరించినట్టు తెలిపారు. జ్యుడీషియల్ రిమాండ్ కోసం ఎల్లారెడ్డి కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసు చేదనలో చాకచక్యంగా వ్యవహరించిన ఎల్లారెడ్డి సిఐ శ్రీనివాస్, ఎస్ఐ గణేష్‌ను స్థానిక డిఎస్పి శ్రీనివాసులు అభినందించారు. అలాగే ఈ కేసు చేదనలో సహకరించిన పోలీసు కానిస్టేబుళ్ల రాము, లిఖ్యా నాయక్, మహేష్, హొంగార్డు ప్రసాద్‌కు నగదు రివార్డ్ అందజేసి డిఎస్పీ అభినందించారు.

21న అర్హత పరీక్ష
హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ రాష్ట్ర షెడ్యూలు కులాల స్టడీ సర్కిల్, రాష్ట్ర స్థాయి ఉద్యోగ పోటీ పరీక్షలకు, నిజామాబాద్ జిల్లాలో ఐదు (05) నెలల ఉచిత శిక్షణ ప్రవేశ అర్హతకు ఈనెల 21న అర్హత పరీక్ష ఉంటుందని షెడ్యూలు కులాల అభివృద్ధి అధికారి బి.శశికళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేర్ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే అర్హత ప్రవేశ పరీక్షకు హాల్ టికెట్లను ఈనెల 17 నుండి వెబ్ సైట్ %షఞ.ఙర్‌బంఎఞఅఙశ్రీవ.ఞఎ.ఱఅ% లో డౌన్లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. పరీక్షకు హజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్ తో పాటు ఆధార్ కార్డు తీసుకొని, పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకోవాలని సూచించారు. ఇతర సమాచారంకోసం 040 - 23546552 సంప్రదించాలని కోరారు.

రాకేష్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్



మండలంలోని పతేపూర్ గ్రామానికి చెందిన ముద్దుకుంట లింబాద్రి అనారోగ్యంతో ఇటీవల మరణించడంతో ఆకుటుంబానికి ఆర్థిక సహాయం కోసం రాకేష్ రెడ్డి యువసేన సభ్యులు ఫౌండేషన్ డైరెక్టర్ సుచరిత రెడ్డిని సంప్రదించారు. బుధవారం సుచరిత రెడ్డి 10వేల ఆర్థిక సహాయం అందజేశారు. బడుగు, బలహీన, పేద ప్రజలకు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవ కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంతోష్, సురేష్ రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- ఘనంగా సీఎం కప్ 2023 క్రీడోత్సవాల ముగింపు
- గెలుపొందిన వారికి బహుమతులు అందజేత

నవతెలంగాణ-విలేకరులు



కమ్మర్‌పల్లిలో..

కంఠేశ్వర్ :నిజామాబాద్ నాగారంలోని గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరంలో చదువుతున్న జి. భార్గవిటీం కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఫరీద్‌పేట గ్రామంలో సీఎం కప్ కబడ్డీలో మొదటి బహుమతి అందుకున్నారు. బెస్ట్ ప్లేయర్ అవార్డు సర్టిఫికెట్ కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చేతుల మీదుగా చేతుల మీదుగా భార్గవి అందుకున్నారని నిజామాబాద్ గురుకుల కళాశాల ప్రిన్సిపల్ సైదా జైనాబ్ తెలిపారు.

ముప్కాల్:సీఎం కప్ మండల క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఎంపీపీ సామ పద్మ-వెంకట్ రెడ్డి, ఎంపీడీవో దామోదర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ సామ పద్మ మాట్లాడుతూ మూడు రోజుల పాటు కొనసాగిన క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులను అందజేశారు. ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, ముప్కాల్ జడ్పీటీసీ బద్ద నర్సవ్వ నర్సారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు నాయకుడు పద్మ కో-ఆప్షన్ సభ్యులు మునిరోద్దీన్, ఉప సర్పంచ్ బ్రహ్మాదండి సువర్ణ, ఎంపీడీవో దామోదర్, తహశీల్దార్ పి.శ్రీకాంత్, ఏఎస్సై గంగారాం, పంచాయితీ సెక్రటరీ విజయ్ కుమార్, ఆర్ఐ గంగారాం, రెంజర్ల, నల్లూర్ గ్రామ సర్పంచులు ఆకుల రాజారెడ్డి, జక్కుల సుగుణ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి అన్నారు. బుధవారం మండలంలోని బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చీఫ్ మినిస్టర్ కప్ ముగింపు వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభగల క్రీడాకారులను ప్రోత్సహించేందుకే తెలంగాణ ప్రభుత్వం చీఫ్ మినిస్టర్ కప్ ఆటల పోటీలు నిర్వహిస్తుందన్నారు. క్రీడాపోటీలద్వారా యువత భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని అన్నారు. వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సంతోష్‌రెడ్డి, సర్పంచ్ సక్కారం అశోక్, మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ గౌడ్, మండల విద్యాధికారి ఆంధ్రయ్య, ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

> చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రజాప్రతినిధులు అన్నారు. ఈనెల 15నుండి నిర్వహించిన సీఎం కప్-2023 మండల క్రీడోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈసందర్భంగా విజేతలకు బహుమతులను అందజేశారు.

డిచ్‌పల్లి: డిచ్ పల్లి మండలంలోని ఖిల్లా డిచ్ పల్లి, ఇందల్‌వాయి మండలంలోని గన్నారం గ్రామాల్లోని జడ్పీఎస్ఎస్‌లో పాఠశాల మైదానంలో నిర్వహించిన ఈ పోటిల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్, ఎంపిడివో రాములు నాయక్, గోపి బాబు, తహసిల్దార్లు శ్రీనివాస్ రావు, టివి రోజా ప్రజా ప్రతినిధులతో కలిసి అందజేశారు. కబడ్డీ, ఖోఖో, వాలిబాల్‌లో జట్లకు మొదటి, ద్వితీయ బహుమతులను, ట్రోఫిలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపివోలు రాజ్ కాంత్‌రావు, నిట్టు కిషన్ రావు, నింపి రాజ్ కుమార్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్మూర్:పట్టణంలో ఎస్సీ సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో సీఎం కప్ క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేసినట్టు మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినిత పవన్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసయ్య, జెడ్పిటిసి సంతోష్, తహసిల్దార్ వేణు గోపాల్ గౌడ్ ఎంపీడీవో శ్రీనివాస్ ఎంఈఓ, రాజా గంగారాం, మున్సిపల్ అధికారులు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏర్గట్ల:మండలంలోని తడపాకల్ గ్రామంలో మంగళవారం ఎంపీపీ ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన మొదలైన సీఎం కప్ క్రీడాపోటీలు ముగియడంతో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. కబడ్డీలో ప్రథమ బహుమతి తడపాకల్ జట్టు, ద్వితీయ బహుమతి ఏర్గట్ల గెలుచుకుంది. ఖోఖోలో ప్రథమ బహుమతి బట్టాపూర్, ద్వితీయ బహుమతి తడపాకల్, వాలీబాల్‌లో ప్రథమ బహుమతి ఏర్గట్ల, ద్వితీయ బహుమతి గుమ్మిర్యాల్ జట్లను వరించాయి. 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ బహుమతి కార్తీక్,ద్వితీయ బహుమతి గుండ అజయ్, తృతీయ బహుమతి లోలపు ప్రదీప్ గెలుచుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేంధర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్,సర్పంచ్ పత్తిరెడ్డి ప్రకాష్, ఉపసర్పంచ్ లోలపు అశోక్, తహసీల్దార్ జనార్ధన్, ఎంపీడీఓ రాజేశం, ఎంఈఓ ఆంధ్రయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎం. మునిరోద్దీన్, పిఈటీ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

భీంగల్:క్రీడలతో తల్లిదండ్రులకు, పుట్టిన గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని జెడ్పీటీసి చౌట్‌పల్లి రవి, యంపిపి ఆర్మూర్ మహేష్ అన్నారు. సీఎం కప్ పోటీల విజేతలకు మండలపరిషత్ కార్యాలయంలో బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తు కావాల్సిన సదుపాయాలను కల్పిస్తుందని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదుగాలని తెలిపారు. కార్యక్రమంలో యంపిడిఓ రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీధర్‌కుమార్, యంఈఓ స్వామి, యంపిటీసిలు సాయిప్రసన్న, సుర్జీల్ పాల్గొన్నారు.



ముప్కాల్‌లో..



డిచ్‌పల్లిలో..

సాయిబాబుకు ఎన్‌టీఆర్ స్మారక సాహితీ, సామాజిక సేవా పురస్కారం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా తెలుగు వెలుగు, సాంస్కృతిక సమాఖ్య సంస్థ, మద్దుకూరి సాయిబాబుకు ఎన్‌టీఆర్ స్మారక సాహితీ సామాజిక సేవా పురస్కారాన్ని అందజేశారు. బుధవారం తెలుగువెలుగు ఆధ్వర్యంలో ఇందూరు యువత స్వచ్ఛంద సేవాసంస్థ కార్యాలయం లో యన్ టి ఆర్ స్మారక పురస్కార సభ జరిగింది. సభకు అధ్యక్షత వహించిన ఇందురు యువత సంస్థ గౌరవాధ్యక్షులు దారం గంగాధర్ మాట్లాడుతూ.. నిత్యం సామాజిక, సాహితీ సేవలు చేస్తున్న సాయిబాబు కు ఈ పురస్కారం లభించడం సముచితం అన్నారు. కార్యక్రమానికి ముఖ్యాతిథిగా వచ్చిన ప్రముఖకవి డా.కాసర్ల నరేశ్ రావు మాట్లాడుతూ.. యువరచయితగా, కవిగా రాణిస్తున్న మద్దుకూరి సాయిబాబు ఎన్నో సాహిత్యసభలను ఏర్పాటు చేసి విజయవంతంగా నడిపించారన్నారు. తెలుగువెలుగు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఎన్‌టీఆర్ పురస్కారం నిరంతరం అనాథలూ, అభాగ్యుల సేవలలో తరిస్తున్న సాయిబాబుకు అందించడం తమకు గౌరవంగా ఉందన్నారు. సన్మానగ్రహీత సాయిబాబు, తనకు అందిన ఈ పురస్కారం వలన మరింత బాధ్యత పెరిగిందనీ, ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సాయిబాబుకు సంస్థ బాధ్యులు జగన్ మోహన్, చిటిమిల్ల హరిప్రసాద్ , సంజీవన్ రావు, రామేశ్వర్ రెడ్డి, బాలకిషన్ , వెంకన్న, తొగర్ల సరేశ్ తదితరులు అభినందించారు.

బీఎస్‌పీ అర్బన్ కమిటీని తొలగించే అధికారం జిల్లా కమిటీకి లేదు

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీఎస్‌పీ అర్బన్ కమిటీని రద్దు చేసే అధికారం పార్టీ జిల్లా కమిటీకి లేదని పార్టీ అర్బన్ ఇన్‌చార్జి నీరడి లక్ష్మణ్ అన్నారు. బుధవారం ద్వారాకనగర్ అర్బన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ.. తాను పార్టీ పేరును, పార్టీ ప్రతిష్టకు ఎక్కడ భంగం కలిగించలేదని అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో మాట్లాడడం జరిగిందని వారు అర్బన్‌లో పార్టీ బలోపేతానికి పనిచేయాలని సూచించారన్నారు. సమావేశంలో షకీల్ అహ్మద్, సిహెచ్ రాజశేఖర్ పాల్గొన్నారు.

తెలంగాణ పద్మశాలీ సంఘం కార్యదర్శిగా చెన్న రవికుమార్



నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం కార్యదర్శిగా పట్టణానికి చెందిన చెన్న రవికుమార్ నియమితులయ్యారు. హైదరా బాద్‌లోని నారాయణ గూడలోగల పద్మశాలి భవన్ నందు అఖిల భారత పద్మశాలి సంఘం అనుబంధంగా తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా చెన్న రవికుమార్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు మచ్చ ప్రభాకర్ రావు అఖిలభారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి బుధవారం నియామక పత్రం అందజేశారు. పద్మశాలి కుల అభ్యున్నతికి, సంక్షేమానికి పాటుపడాలని వారు సూచించారు.న చెన్న రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 30 లక్షలు ఉన్న పద్మశాలి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా చెన్న రవికుమార్ అఖిలభారత పద్మశాలీ సంఘం శాశ్వత సభ్యత్వం పదివేల రూపాయలు చెల్లించి సభ్యత్వం తీసుకున్నారు.కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి కమర్తపు మురళి, యువజన విభాగం అధ్యక్షులు బండారి శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు సునీత, పద్మశాలీ సంక్షేమ సేవ వ్యవస్థాపక అధ్యక్షులు మ్యాక మోహన్ దాస్, జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ




కల్యాణలక్ష్మీ చెక్కులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మండలంలోని ఎనిమిది గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను మంగళవారం ఎంపీపీ లావణ్య లింగాగౌడ్, జడ్పీటీసీ సభ్యులు దాసరి లావణ్య వెంకటేష్, తహశీల్దార్ వినోద్ పంపిణీ చేశారు. మండలంలోని బాల్కొండ, కిసాన్ నగర్, వన్నెల్ (బి), చిట్టాపూర్, బోదెపల్లి, జలాల్పూర్, నాగపూర్, ఇత్వార్ పేట్ గ్రామాలకు చెందిన 36లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సంతోష్ కుమార్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్ యాదవ్, సర్పంచ్‌లు నోముల రవి, మానేటి తులసి నాగభూషణం, చాట్లపల్లి వనజ గోవర్ధన్ గౌడ్, గడ్పంద కల్పన అనీల్, సంతకుల సాయమ్మ జువ్వన్న, పాల్గొన్నారు.

ఫిట్టుగాలేని లైన్‌మెన్‌లను విధుల నుండి తప్పించండి



మాట్లాడుతున్న సాయిరెడ్డి

నవతెలంగాణ-సిరికొండ

తమ విధులు, బాధ్యతలు నిర్వర్తించే క్రమంలో ఫిట్టుగాలేని విద్యుత్ లైన్మెన్లను విధుల నుండి తప్పించి యువతకు అవకాశం కల్పించాలని భారతీయ రైతు సేవా సంఘం జాతీయ కార్యదర్శి కొండెల సాయిరెడ్డి అన్నారు. ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతిచెందిన న్యావనంది గ్రామానికి చెందిన రైతు నారాయణ కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లైన్మెన్లు తమకు పని రాకున్నా, విద్యుత్తు స్తంభాలను ఎక్కలేని పరిస్థితిలో ప్రైవేటు వ్యక్తులను పనులలో పెట్టుకొని, వారిచేత పనులు చేయిస్తున్నారని అన్నారు. అనుకోని పరిస్థితులలో ప్రమాదాలు సంభవించినప్పుడు, వారి కుటుంబంలో పెద్దదిక్కులను కోల్పోతున్నారని, పని చేతకాని లైన్మెన్లు విధి నిర్వహణలో పనికిరారని, వారిని విధుల నుండి తప్పించాలని కోరారు. నారాయణ విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంతో చనిపోయాడని, వెంటనే వారి కుటుంబానికి 5లక్షల రూపాయలు విద్యుత్‌శాఖ తరపు నుంచి అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాయినాథ్ రెడ్డి, వాసుదేవరావు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని పాలెం గ్రామానికి చెందిన అంగాడీ హారిక రెండు రోజుల నుండి కనిపించడం లేదని తండ్రి అంగడి భాస్కర్ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ముత్యంరాజ్ తెలిపారు. పాలెం గ్రామంలో కిరాణా దుకాణం కొనసాగిస్తున్న భాస్కర్ మధ్యాహ్నం భోజనానికి వెళ్లేందుకు కూతురు హారికను ఈనెల 15న ఒకటిన్నర సమయంలో షాపులో ఉంచి ఇంటికి వెళ్ళాడు. భోజనం ముగించుకొని షాపునకు వచ్చేలోపు హారిక షాపులో కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికిన కనిపించకపోవడంతో బుధవారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. యువతి ఎక్కడైనా కనిపిస్తే స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని 8712659867కు తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

జీజీహెచ్‌లో వెయ్యిపడకలకు పెంచాలి

- ఓపి, ఐపి సేవలు పెరిగాయి
- ఆస్పత్రిలో స్టాఫ్ సంఖ్య పెంచాలి ఏఐటీయూసీ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ




ధర్నాచేస్తున్న కార్మికులు

జిల్లా కేంద్రంలోని (జీజీహెచ్) ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ముందు ఏఐటీయూసీ యూనియన్ నాయకులు ధర్నా నిర్వహించి, అనంతరం ఆసుపత్రి సూపరిండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రస్తుతం 615 పడకలు ఉన్నప్పటికీ, నిజామాబాద్ జిల్లాతో పాటు కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల ప్రజలు నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి సేవలకు వస్తున్నారన్నారు. ఓపి (ఔట్ పేషెంట్), ఐపి (ఇన్ పేషెంట్) సేవలు పెరిగాయని, కరోనా సమయంలో, ఆ తర్వాత కూడా ఓపి, ఐపి సేవలు పెరుగుతున్నందున సంబందించిన డాక్టర్లు, నర్సులు, శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ ఇతర పనులు చేస్తున్న వారిపై పని భారం పెరుగుతుందన్నారు. నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వెయ్యి పడకలకు పెంచి, ఆస్పత్రిలో స్టాఫ్ సంఖ్య పెంచాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సుధాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ వారికి జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం చెల్లించడం లేదని అన్నారు. మే 1న ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా పారిశుధ్య కార్మికులకు నెలకు వెయ్యి రూపాయలు వేతనం పెంచుతామని ప్రకటించినప్పటికీ, ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులకు వర్తింపజేయకపోవడం అన్యాయమని, వెంటనే ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని అధికారులను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి డి.భాగ్యలక్ష్మి, నాయకులు వెంకట్, స్వరూప, వసంత, నాగలక్ష్మి పవిత్ర, మమత, సత్తయ్య, తదితర శానిటేషన్, పేషంట్ కేర్ వారు పాల్గొన్నారు.

మైనారిటీల సమస్యలు పరిష్కరించండి

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని అన్ని గ్రామాల మైనారిటీ నాయకులు బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఆర్‌టీసి చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు గౌస్ బాషా మాట్లాడుతూ....మండలంలోని అన్ని గ్రామాల మైనారిటీల సమస్యలను విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అన్ని గ్రామాల మైనార్టీల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చి, 60 లక్షల రూపాయల అంచనా వేయడం జరిగిందని తెలిపారు. ఆర్టీసీ చైర్మన్‌ని కలిసిన వారిలో మైనార్టీ మండల అధ్యక్షులు గౌస్ బాషా, మాజీ అధ్యక్షులు అన్సార్, తూంపల్లి సొసైటీ వైస్ చెర్మెన్ అబ్బాస్, లియకత్, సాజిద్,రహీం, వహిద్, ఫారూఖ్, మండల మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.




ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మైనారిటీ నాయకులు

ప్రజా సమస్యలు పక్కనపెట్టి
పార్టీ కార్యక్రమాలకే పరిమితమైన ఎమ్మెల్యేలు, మంత్రి

- కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

ప్రజా సమస్యలు పక్కనపెట్టి జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు పార్టీ కార్యక్రమాలకే పరిమితమయ్యారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి విమర్శించారు. బుధవారం మండలంలోని హస కొత్తూర్ గ్రామంలో మండల కమిటీ అధ్యక్షులు సుంకేట రవి ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఎమ్మెల్యేలు, మంత్రి ప్రజా సమస్యలను పక్కనపెట్టి చుట్టపు చూపుగా నియోజకవర్గాలకు వస్తున్నారని, మిగిలిన సమయాన్ని అంతా పార్టీ కార్యక్రమాలకు కేటాయిస్తున్నారన్నారు. మహారాష్ట్రలో ఇద్దరు, ఢిల్లీలో ఒకరు తిరుగుతున్నారన్నారు. ఉపాధి కూలీలకు చేసిన పనికి డబ్బులు నెలల తరబడి ఆలస్యంగా వస్తున్న జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు పట్టించుకోవడంలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఉపాధి కూలీలకు 200 రూపాయలు తగ్గకుండా కూలిని అందిస్తామని తెలిపారు. రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని, ఇల్లు లేని పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు, 500 రూపాయలకే వంట గ్యాస్ అందిస్తామని అన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. నిరుద్యోగులకు రూ.4వేల నిరుద్యోగ భృతి ఇస్తామని, ఆరోగ్య శ్రీ ద్వారా పేద ప్రజల వైద్యం కొరకు రూ.5 లక్షలు అందిస్తామని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్ ,జిల్లా మైనారిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రఫీ, మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు పడిగెల ప్రవీణ్, తక్కురి దేవేందర్, గోపిడి లింగారెడ్డి, శ్రీనివాస్, ఏనుగు రాజేశ్వర్, మహేందర్ గౌడ్, పడాల మల్లేష్, కొమ్ముల రాజేందర్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

2.50లక్షల ఎల్‌ఓసి అందజేత

- కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మహిళకు అండగా మంత్రి వేముల

నవతెలంగాణ-ఏర్గట్ల



బాధిత మహిళ బంధువుకు ఎల్ఓసి అందజేస్తున్న మంత్రి

ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి బాసటగా నిలుస్తున్నాడు. అనారోగ్యం బారిన పడిన కుటుంబాలను వ్యక్తిగతంగా పరామర్శిస్తూ... వారి కుటుంబాలకు ధైర్యాన్ని అందిస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన ఆలకుంట లక్ష్మీ అనే మహిళ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా ఈ విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళారు. వెంటనే స్పందించిన మంత్రి హైదరాబాద్ లోని నిమ్స్ వైద్యులతో మాట్లాడి ఆమె చికిత్స కొరకు 2 లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసి అందించి ఆమెను నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. అండగా నిలిచిన మంత్రి ప్రశాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

చెరువులోపడి యువకుడు మృతి

నవతెలంగాణ-మోపాల్



యువకుడి మృతదేహం

మండలంలోని ముదక్‌పల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఎస్ఐ వివరాల ప్రకారం.. ఓల్లెపు రాజు (16) కెంపు నరేష్‌బద్ద గతసంవత్సరంనుండి బర్లు మేపుతున్నాడు. ఈనెల 16న ఉదయం బర్లను తీసుకుని సిర్పూర్ గ్రామంలోని రామన్ చెరువు వద్దకు వెళ్లాడు. అక్కడ స్నానంకోసం చెరువులోకి దిగాడు. రాజుకు ఈత రాకపో వడంతో ప్రమాదవశాత్తు చెరువులో మునిగి చనిపోయినాడు. తల్లి ఓల్లెపు ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

అక్రమ తవ్వకాలను అరికట్టాలి

- నసురుల్లాబాద్‌లో రాస్తారోకో

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నసురుల్లాబాద్ మండల పరిధిలో యథేచ్ఛగా ఇసుక, మొరం అక్రమ తవ్వకాలను అరికట్టాలంటూ బీజేపీ నాయకులు రాస్తారోకో చేపట్టారు. మండల కేంద్రంలోని చెక్‌పోస్ట్ వద్ద బోధన్ వెళ్లే రహదారిపై బుధవారం రాస్తారోకో నిర్వహించడంతో వాహనాలు నిలిచిపోయారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో నిబంధనలకు విరుద్ధంగా ఈ అక్రమ మైనింగ్ కొనసాగుతుందని, ఈ అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకొని బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాల్యాద్రిరెడ్డి, హన్మాండ్లు, నరేశ్ రాథోడ్, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

22న ఆశాల ధర్నాను విజయవంతం చేయండి

నవతెలంగాణ-జుక్కల్

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆసుపత్రి కేంద్రాల వద్ద ఈ నెల 22న ఆశా కార్యకర్తలు చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ కామారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు సురేష్‌గొండ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆశాకార్యకర్తల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, ప్రభుత్వం ఆశాలకు అర్హత పరీక్షలు పెట్టడానికి అంతర్గతంగా చర్చలు కొనసాగుతున్నాయని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని, యూనిఫాంలు ఇవ్వాలని, పని గంటలు తగ్గించాలని, జాబ్‌చార్ట్ పెట్టాలని, పండుగలకు సెలవులు ఇవ్వాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని, టీఏ, డీఏ, పీఎఫ్‌లు వెంటనే ఇవ్వాలని, 2021 నుంచి పీఆర్సీ, ఏరియర్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించకుంటే 5 నుంచి సమ్మె

- సమ్మె నోటీసు అందజేసిన రేషన్ డీలర్లు



సమ్మె నోటీసు అందజేస్తున్న డీలర్లు

నవతెలంగాణ-తాడ్వాయి

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించకపోతే జూన్ 5వ తేదీ నుంచి సమ్మె చేస్తామని రేషన్ డీలర్లు స్పష్టంచేశారు. రేషన్ డీలర్ల రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్‌కు, డీఎస్ఓ పద్మజకు రేషన్ డీలర్లు బుధవారం సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గౌరిశెట్టి రాజు, జనరల్ సెక్రెటరీ శంకర్‌రావు, న్యాయ సలహాదారులు అశోక్ జైన్, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదం.. ఎకరా పంట నష్టం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన ఎరుకల ఎల్లవ్వకు చెందిన వరిపంటకు ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో పంట కాలి బూడిద అయ్యింది. రెండు రోజుల వ్యవధిలోనే వరి పంట కోయాలని అనుకున్నప్పటికీ మంగళవారం సాయంత్రం వరి పంటకు నిప్పంటడంతో ఉన్న కాస్త వరి పంట పూర్తిగా అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ప్రభుత్వం ఆదుకోవాలని నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని బాధిత రైతులు కోరుతున్నారు.



పంట వద్ద రోదిస్తున్న రైతు

పిట్లంలో ప్రారంభమైన పారిశుధ్య పనులు

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్ర గ్రామపంచాయతీలో ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలలో భాగంగా రాజీవ్‌గాంధీ కాలనీలో పారిశుద్ధ్య పనులను బుధవారం ప్రారంభించినట్టు సెక్రెటరీ యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా వారోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉత్సవాలలో పంచాయతీ పరిధిలోని అన్ని వార్డులలో మురికి కాల్వల పరిశుభ్రతతో పాటు, చెత్త చెదారం తొలగించి, నీటి సరఫరా, కరెంటు, అప్రోచ్ రోడ్లు, ట్రీగార్డ్, వాటరింగ్ డే పనులను పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని కాచాపూర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి దోమకొండ మండలం సంగమేశ్వర గ్రామానికి చెందిన జేఎల్ఎం రమేష్ గ్రామస్తుల తరపున నిత్యావసర సరుకులు అందజేశారు. ఆపద సమయంలో ఆదుకున్నందుకు బాధితులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, సుదర్శన్, శ్యామ్ కుమార్, వెంకటేష్, లతీఫ్, రహీం తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ దుకాణాల వేలం

నవతెలంగాణ-వర్ని

మండలంలోని ఎస్ఎన్‌పురం గ్రామ పంచాయతీకి చెందిన వ్యాపార సముదాయ దుకాణాలను 20వ తేదీన వేలం వేయనున్నట్టు, ఇందుకు పంచాయతీ కార్యవర్గ సభ్యులు తీర్మానం చేసినట్టు తెలిపారు. ఈ వేలంలో పాల్గొనేవారు పంచాయతీ కార్యాలయం సెక్రెటరీని సంప్రదించి ముందుగా రూ.20వేలు డిపాజిట్ చేసుకోవాలని సెక్రెటరీ సాయిలు తెలిపారు. ముందుగా డిపాజిట్ చేసిన వారు మాత్రమే వేలంలో పాల్గొంటారని, 19వ తేదీ వరకు వ్యాపారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

దళితరత్న అవార్డు గ్రహీతలకు సన్మానం

నవతెలంగాణ-బోధన్

బోధన్ డివిజన్‌కు చెందిన పలువురు దళిత సంఘాల నాయకులకు అంబేద్కర్ జయంతి సందర్భంగా దళిత రత్న అవార్డు రావడంతో ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని రైస్ మిల్స్ భవన్‌లో వారిని బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షులు పరిమి కోటేశ్వరరావు, డివిజన్ అధ్యక్షులు ఈశ్వర్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా బోధన్ పట్టణంలో మహనీయుల జయంతిని ఘనంగా నిర్వహించినట్టు తెలిపారు. భారీ వర్షం కారణంగా కొంత అంతరాయం కలిగినా.. సభ విజయవంతంగా ముగించామని తెలిపారు. అందులో భాగంగా దళిత సంఘాల సభ్యులకు దళిత రత్న అవార్డు రావడం అభినందనీయమని వారిని ఈ సందర్భంగా సన్మానించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాహుల్, దేవేందర్, డాక్టర్ శైలేందర్, కొండ్ర వెంకటి, మల్లికార్జున్, నీరడి రవి, వాగ్మారే సూర్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.



దళితరత్న అవార్డు గ్రహీతలకు సన్మానం

25న మెగా జాబ్‌మేళా

- సద్వినియోగం చేసుకోవాలి
- 2వేల నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం
- జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్ షిండే

నవతెలంగాణ-బిచ్కుంద

జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుంద మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ఈ నెల 25వ తేదీన మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు జుక్కల్ ఎమ్మెల్యే అసెంబ్లీ ప్యానెల్ స్పీకర్ హన్మంత్ షిండే అన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే హనుమంత్ షిండే నాయకులు, కార్యకర్తలతో కలిసి మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే హనుమంత్ షిండే మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ ముందుచూపుతో రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో రాష్ట్రానికి 50 కంపెనీలను తీసుకొచ్చారని, అందులో జుక్కల్ నియోజకవర్గ పరిధిలోని 2000 మంది యువతీ, యువకులకు వారి అర్హతను బట్టి వివిధ రంగాల్లో ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించనున్నట్టు తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, అండర్ గ్రాడ్యుయేట్, డిప్లొమా హెూల్డర్స్, బీఫార్మసీ, ఎంఫార్మసీ, హెూటల్ మేనేజ్మెంట్, డ్రైవర్స్, నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన వారు, బీఈ, బీటెక్, ఎంటెక్, బీఏ, బీఎస్సీ, బీకాం, ఎంబీఏ, ఎంఎస్సీ, ఎంఎస్ సీఎస్, పోస్ట్ గ్రాడ్యుయేట్స్ విద్యార్హతలు కలిగిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ అశోక్ పటేల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకట్రావు దేశాయ్, రైతు సహకార సంఘం అధ్యక్షులు శ్రీహరి బాలు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తదితరులున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

గ్రామాభివృద్ధికి పాటుపడాలి

- జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి సాయన్న

నవతెలంగాణ-తాడ్వాయి

ప్రతి ఒక్కరూ గ్రామాభివృద్ధికి పాటుపడాలని జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి సాయన్న అన్నారు. బుధవారం మండలంలోని చిట్యాల గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సమగ్ర గ్రామ అభివృద్ధిపైన అవగాహన కార్యక్రమాన్ని రైతు వేదికలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి సాయన్న హాజరై మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ గ్రామ అభివృద్ధికి పాటుపాడాలని సూచించారు. జాతీయ ఉపాధి హామీ ద్వారా చేసుకొనే వెసులుబాటు కలిగిన పనుల గురించి క్లుప్తంగా వివరించారు. మహిళా సంఘాలు ఏ విధమైన వ్యాపారాలు చేసుకొని ఒక వ్యాపారవేత్తగా ఎదగాలనే దాని గురించి వివరించారు. రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా మేనేజర్ రాజు పులగం మాట్లాడుతూ.. రిలయన్స్ ఫౌండేషన్ చేపట్టబోయే కార్యక్రమాలను క్లుప్తంగా వివరించారు. ఐకేపీ డీపీఎం సుధాకర్ మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ సాయన్న, ఎంపీడీఓ రాజ్‌వీర్, ఐకేపీ డీపీఎం సుధాకర్, రిలయన్స్ ఫౌండేషన్ డీపీఎం పులగం రాజు, సర్పంచ్ కవిత బాలయ్య, ఎంపీటీసీ రాజమణి రవీందర్, రైతు బంధు అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి, రిలయన్స్ ప్రతినిధులు వీరేశం, స్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారి సాయన్న

నిరవధిక సమ్మెను విరమించబోం

- గౌరవ వేతనం పెంచాల్సిందే
- వీవోఏల డిమాండ్

నవతెలంగాణ-ఎడపల్లి/కోటగిరి

తమకు గౌరవ వేతనం పెంచాల్సిందేనని, అంతవరకూ నిరవధిక సమ్మె విరమించబోమని వీవోఏలు స్పష్టం చేశారు. మండల కేంద్రంలో చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారానికి 24వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీవోఏల మండల అధ్యక్షులు సుదర్శన్, పోచయ్య, యూసుఫ్ మాట్లాడారు. తమ సమస్యల డిమాండ్ల సాధనకై న్యాయంగా పోరాడుతున్నామని చెప్పారు. నెలకు కనీసం రూ.20వేల గౌరవ వేతనంతో, అత్యవసర పరిస్థితుల్లో రూ.50 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రతతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, జీవో నెంబర్ 51ను రద్దు చేసి అందరికీ సమన్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో పోచయ్య, యూసుఫ్, కొమరవ్వ కుమ్మరి పుష్ప, జంగం సంధ్య, కొమురవ్వ, మహేశ్వరి, లత, శోభ, నసీర బేగం, గ్రామాల వీవోఏలు పాల్గొన్నారు.



కోటగిరి : సమ్మెలో పాల్గొన్న వీవోఏలు

మండుటెండలో నిరాటకంగా సమ్మె..

కోటగిరి : మండల కేంద్రంలో ఉమ్మడి మండలంలోని వీవోఏల సమ్మె 24వ రోజుకు చేరుకుంది. మండుటెండను కూడా లెక్కచేయకుండా వీవోఏలు సమ్మె చేపట్టారు. రూ.18వేల గౌరవ వేతనం అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. యూనియన్ ప్రతినిధులు, అధ్యక్షురాలు సరిత, ఉపాధ్యక్షుడు సాయిలు, కార్యదర్శి రమేష్, కోశాధికారి సుమ, సహాయ కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-సదాశివనగర్

చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. బుధవారం మండలంలోని వజ్జెపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వీర వనిత చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ మహెూత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దొరల, దేశ్‌ముఖ్‌ల నిరంకుశ పాలనపై తిరుగుబాటు చేసిన వీర వనిత చాకలి ఐలమ్మను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. అణగారిన కులాల అభివృద్ధి కోసం కృషి చేసిన ఘనత ఐలమ్మదేనని గుర్తు చేశారు. నాటి కాలంలో దేశ్‌ముఖ్‌లు, దొరల మీద తిరుగు బాటు చేసి, తెలంగాణ ప్రాంతంలో దొరల పాలనను ఎదిరించి పోరాడిన వీర వనిత గొప్పతనాన్ని తెలంగాణ రాష్ట్రంలో స్మరింపచేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని కొనియాడారు. సీఎం కేసీఆర్ కులమతాలకు అతీతంగా అన్నివర్గాల వారు అభివృద్ధి చెందే విధంగా అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అందరికీ సమన్యాయం చేస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ అని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆడ మగ అనే బేధం లేకుండా చదువుకోవాలనే ఉద్దేశ్యంతో విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని తెలిపారు. గురుకుల పాఠశాల ఏర్పాటు, హాస్టళ్లలో సన్నబియ్యంతో భోజనం, తదితర వసతులను కల్పించి విద్యను అందించి, ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత స్థితిలో స్థిరపడే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. తమ పిల్లల ఉన్నత చదువుల కోసం ఎలాంటి సహాయం కావాలన్నా తనను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గైని అనుసూయ, జడ్పీటీసీ కమిలి నర్సింలు, మార్కెట్ కమిటీ పుల్గం సాయిరెడ్డి, వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బొలిపెల్లి మహేందర్‌రెడ్డి, సర్పంచ్ ఎర్రం నర్సయ్య, కొత్తకొండ లక్ష్మీ, రజక సంఘం నాయకులు, సాకలి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

వడ్డెర కులస్తుల సమస్యలు పరిష్కరిస్తాం..

వడ్డెర కులస్తుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే జాజాల సురేందర్ హామీ ఇచ్చారు. బుధవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సదాశివనగర్ మండలం వడ్డెర సంఘం అధ్యక్షులు శైలేందర్ తమ కులస్తుల సమస్యలు పరిష్కరించాలని కోరగా.. ఆయన స్పందించి త్వరలోనే మీ కులస్తులతో సమావేశమై సాధ్యమైనంత వరకు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర వడ్డెర సంఘం కార్పొరేషన్ చైర్మన్ సత్తయ్య తన మిత్రుడేనని మీకు ఏ విధంగా సాయం చేయాలో ఆయనతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

యూత్ జోడో-బూత్ జోడోను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

- ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్

యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపడుతున్న యూత్ జోడో బూత్ జోడో కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని జీఎస్ఆర్ గార్డెన్‌లో యూత్ జోడో బూత్ జోడో కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి సంబంధించిన అంశాలను స్క్రీన్‌పైన ప్రదర్శించి యువజన కాంగ్రెస్ కార్యకర్తలకు వివరించారు. సమావేశంలో ఐవైసీ నేషనల్ కోఆర్డినేటర్ తెలంగాణ ఇంచార్జ్ శ్రీనివాస్ పాల్గొని యూత్ కాంగ్రెస్ నాయకులకు యూత్ జోడో బూత్ జోడో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. బూతుల వారిగా యూత్ కాంగ్రెస్ సభ్యుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేసే ప్రక్రియను వివరించారు. ప్రతి బూత్‌లో ఐదుగురు సభ్యులను తగ్గకుండా నమోదు చేయాలని సూచించారు. మే 20వ తేదీలోగా ఈ ప్రక్రియను పూర్తి చేసిన వారికి పార్టీలో సముచిత స్థానం దక్కుతుందని అన్నారు. సమావేశంలో భిక్కనూర్ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు చంద్రబాబు, రాయిని దేవేందర్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరెకటిక సంఘం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే నిధులు మంజూరు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని ఆరెకటిక సంఘం భవన నిర్మాణం కోసం ఎమ్మెల్యే హన్మంత్ షిండే నిధులను మంజూరు చేశారని విండో చైర్మెన్ నాగలగిద్దే శివానంద్ తెలిపారు. బుధవారం కటిక సంఘం సభ్యులతో కలిసి ఎంపీపీ యశోదా నీలు పటేల్, స్థానిక సర్పంచ్ రాములు కలిసి భూమిపూజ చేశారు. ఎంపీపీ యశోదా నీలు పటేల్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సహకారంతో ఆరెకటిక భవన నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయడంతో సంఘం సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆరెకటిక సంఘం పెద్దలు, స్థానిక బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

పారిశుద్ధ్య కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలి

- పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్

నవతెలంగాణ-తాడ్వాయి

గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ అధికారులను ఆదేశించారు. మండలంలోని ఎర్రపహాడ్ గ్రామంలో ఆయన పారిశుధ్య కార్యక్రమాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో తిరుగుతూ గ్రామంలోని పరిసరాలను పరిశీలించారు. పశువుల తొట్టిలలో చెత్తాచెదారం ఏమైనా ఉందా అనే విషయమై పరిశీలించారు. తొట్టెలు ఎలా ఉపయోగిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. పారిశుధ్య వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ శ్రీనివాస్, డీఎల్‌పీఓ సాయిబాబా, ఎంపీఓ ఎఫ్‌సీ బారాని, సర్పంచ్ నరసారెడ్డి, ఉపసర్పంచ్ పడమటి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి

- ఏఐకేఎంఎస్ నాయకుల డిమాండ్



కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

గ్రామీణ ఉపాధిహామీలో పనిచేస్తున్న కూలీల సమస్యలను పరిష్కరించాలని, వారికి పనిచేసే ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఏఐకేఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం బోధన్ మండలంలోని చిన్నమావంది, పెద్దమావంది గ్రామ శివారులో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి వారు కూలీల సమస్యలను తెలుసుకొని బోధన్ ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూలీలు పని చేసే చోట తాగునీరు, నీడ కోసం టెంట్, మెడికల్ కిట్ తదితర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కొన్ని నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న కూలీల డబ్బులు వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ బోధన్ మండల అధ్యక్షులు చిన్న పర్వయ్య, జిల్లా నాయకులు పిరోల్లా పోశెట్టి, సూర్య విఠల్, న్యూడెమోక్రసీ నాయకులు గౌతం కుమార్, కళ్యాణ్, పోశెట్టి, లక్ష్మణ్, సావిత్రి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

జీలుగా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న జీలుగా విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నసురుల్లాబాద్ ఎంపీపీ పాల్త్య విఠల్, సొసైటీ అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఎంపీడీవో ఆఫీస్‌లో వారు మాట్లాడుతూ.. మైలారం, నసురుల్లాబాద్, దుర్కి, మిర్జాపూర్ సహకార సొసైటీల్లో జీలుగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ రైతు పెట్టుబడులు తగ్గించుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడి అధిక లాభదాయక పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణలో రైతు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్, సబ్సిడీపై విత్తనాలు తదితర పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. పంటల సాగులో సేంద్రియ ఎరువులను వాడాలని రైతులకు సూచించారు. వీరి వెంట ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ

పంట పొలాల రోడ్డుకు నిధులు మంజూరు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని శెట్పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం ముందు నుంచి వ్యవసాయ పంట పొలాలకి వెళ్లే రోడ్డు మరమ్మతులకు ఎల్లారెడ్డి శాసనసభ్యులు జాజాల సురేందర్ నిధులు మంజూరు చేసినట్టు సర్పంచ్ పద్మ గంగారెడ్డి తెలిపారు. గ్రామ సమీపంలోని శ్రీ మల్లికార్జున ఆలయం నుంచి పెద్ద వాగు వర్షాకాలంలో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పండించిన ధాన్యం ఇంటికి తీసుకురావాలంటే కష్టతరంగా ఉండటంతో ఈ విషయాన్ని సర్పంచ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఎమ్మెల్యే వెంటనే నిధులు మంజూరు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నాయకోటి సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి అట్టెం శీను, దళిత సంఘం నాయకుడు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతూ ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సోనియా శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతిలో 10/10 మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలోని జంగంపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10/10 మార్కులు సాధించిన వైష్ణవిని కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, డీఈవో రాజు, సోనియా శంకర ఫౌండేషన్ ప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు లింబాద్రి, విద్యాకమిటీ చైర్మన్ పోచయ్య, ఉపాధ్యాయులు గఫూర్ శిక్షక్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమ్మెకు సిద్ధమవుతున్న రేషన్ డీలర్లు

- జూన్ 5 నుంచి రేషన్ దుకాణాలు బంద్?

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రజా పంపిణీ వ్యవస్థలో రేషన్ డీలర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. వారు సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టనున్నారు.. వచ్చేనెల 5నుంచి రేషన్ దుకాణాలు బందు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం డీలర్ల సమస్యలను పరిష్కరించడానికి చొరవ చూపకపోవడంతో మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ ఏవోకు సమ్మె నోటీస్ సైతం అందజేశారు.

ప్రధాన డిమాండ్లు..

పౌర సరఫరాల శాఖ పరిధిలో రేషన్ దుకాణాల నిర్వహణ కొనసాగుతుంది. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న రేషన్ డీలర్ల తమ ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పౌరసరఫరాల శాఖ కమిషనర్‌కు నోటీస్ ఇచ్చారు. అందులో ప్రధానంగా రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలని, ప్రతి రేషన్ డీలర్‌కు హెల్త్ కార్డు ఇవ్వాలని, కరోనా సమయంలో మరణించిన రేషన్ డీలర్ల కుటుంబాలకు 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. శాశ్వత అథరైజేషన్ ఇవ్వాలని, గన్నీ సంచుల ధర 30 రూపాయలకు పెంచాలని, కారుణ్య నియామకాలను 62 సంవత్సరాల వరకు పెంచాలని, డీలర్ల అవసరాన్ని బట్టి రుణాలను ఇవ్వాలని కోరుతున్నారు.



కలెక్టరేట్ ఏవోకు వినతినిస్తున్న రేషన్ డీలర్లు

ఇతర రాష్ట్రాల్లో సైతం..

తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో రేషన్ డీలర్లకు అక్కడి ప్రభుత్వం గౌరవ వేతనం ఇచ్చే మాదిరిగా మన రాష్ట్రంలో రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఎందుకు ఇవ్వడం లేదని అంటున్నారు. కమిషన్ శాతం కూడా తక్కువగా ఉండడంతో రేషన్ డీలర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ ఆహార భద్రత చట్టం ఎన్ఎఫ్ఎస్ఏ కింద 35 లక్షల రేషన్ కార్డులతో పాటు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన 53 లక్షల రేషన్ కార్డులు కలిపితే మొత్తం 88 లక్షల రేషన్ కార్డులకు ప్రతినెల రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులో నమోదైన ప్రతి ఒక్కరికి ఆరు కిలోల బియ్యం చొప్పున ఒక్క రూపాయికి అందజేస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున మూడు రూపాయలకు ఇస్తుంది.

ఉమ్మడి జిల్లాల్లోనూ..

ఉమ్మడి జిల్లాలోనూ 3,81,375 రేషన్ కార్డులకు ప్రతినెల 6783 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం పంపిణీ జరుగుతుంది.ఆర్మూర్ పట్టణంలో మొత్తం 21 రేషన్ షాపులు ఉండగా, మండలంలో 57 షాపులు ఉన్నాయి.

దీర్ఘకాలంగా సమస్యలు పెండింగ్



రేషన్ డీలర్ల సమస్యలు సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్నాయి. అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినాము. చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలి.
సుద్దపల్లి సురేష్, రూరల్ రేషన్ డీలర్ల ప్రతినిధి, ఆర్మూర్.

హామీలను అమలు చేయాలి



ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన రేషన్ డీలర్లకు కనీస గౌరవ వేతనం హామీని వెంటనే నెరవేర్చాలి. సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి.
- ఉమారాణి, రేషన్ డీలర్, ఆర్మూర్

మృతుల కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రానికి చెందిన బీజేపీ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీశైలం, రాజేందర్, శ్రీనివాస్ తండ్రిచెలిమెల పెద్ద రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బుధవారం వారి కుటుంబ సభ్యులకు బీజేపీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండల లక్ష్మి నారాయణ పరామర్శించారు. అయన వెంట బీజేపీ నాయకులు, ధర్పల్లి మాజీ జెడ్పిటిసి కర్క గంగారెడ్డి, పాల్తి గంగాదాస్ గుప్తా, జగ్ర మహిపాల్ యాదవ్, కర్క పెద్ద బాల్ రెడ్డి, నల్ల పెంటన్న, గంగరాజ్యం, నాగయ్యోల్ల వెంకన్న, నవీన్, శ్రీకాంత్, గొల్ల మల్లయ్య, భగత్, దరి సింగ్, తదితరులు ఉన్నారు.

ఆశ హాస్పిటల్‌లో అరుదైన ఆపరేషన్



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ ఆశ సూపర్ హాస్పిటల్‌లో పేగు క్యాన్సర్ సర్జరీ విజయవంతం చేయడం జరిగిందని, ఇందుకు డాక్టర్ బాల్‌రెడ్డి తీవ్ర కృషి చేసినట్టు వైద్యులు శేఖర్ రెడ్డి బుధవారం తెలిపారు. హీరాబాయి అనే మహిళ కొంతకాలంగా ఈ వ్యాధితో బాధపడుతున్నట్టు చెప్పారు. ఆపరేషన్ చేసి క్యాన్సర్ కారక భాగాన్ని తొలగించామని, క్లిష్టతరమైన వ్యాధులకు ఆధునాతన పరికరాలతో అనుభవజ్ఞులైన వైద్యులు కల పరిసర ప్రాంత ప్రజలకు వైద్యం అందించడంలో ఆశ హాస్పిటల్ ముందుంటుందని డాక్టర్ బాల్ రెడ్డి తెలిపారు.

నేడు సబ్ స్టేషన్, బీటీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

- కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని చంద్రాయాన్ పల్లి గ్రామంలో సబ్ స్టేషన్, రూప్లానాయక్ తండా నుండి మెగ్యానాయక్ తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణం, రూప్లానయక్ తండాలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి, సామ్య నాయక్ తండాలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేపట్టనున్నట్లు ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్ తెలిపారు. బుదవారం ఇందల్ వాయి మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రూప్లానాయక్ తండాలో 20 లక్షల రూపాయలతో నుతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, చంద్రాయన్‌పల్లి గ్రామంలో 5లక్షల రుపాయలతో ఒపెన్ జిమ్, 2కోట్ల10 లక్షల రూపాయలతో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం, రుప్లానాయక్ తాండా నుండి మెగ్యా నాయక్ తండ వరకు లింకు రోడ్డు నిర్మాణంకు 4కోట్ల 25లక్షలు, సామ్య నాయక్ తండాలో బీటీ రోడ్డు నిర్మాణానికి 85లక్షలతో పనులకు గాను శంకుస్థాపన చేపట్టనున్నట్లు ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్ వివరించారు. కల్యాణ లక్ష్మి 58, షాదీ ముబారక్ ఏడు చెక్కులను అందజేయన్నట్లు ఆయన తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చిలివెరి గంగా దాస్ మాట్లాడుతూ.. గురువారం ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ చంద్రయాన్ పల్లి గ్రామ పర్యటన సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన సర్పంచ్లు ఎంపీటీసీలు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచాలి



దోమకొండ : మెమోంటోను అందజేస్తున్న దృశ్యం



పిట్లంలో..

నవతెలంగాణ-విలేకరుల బృందం

దోమకొండ : మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి దోమకొండ మండలం పేరును ముందుంచాలని జెడ్పీటీసీ తీగల తిరుమల్ గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సీఎం కప్ పోటీలలో మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యం వెలికి తీయడానికి సీఎం కప్ క్రీడలను నిర్వహిస్తుందన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచాలన్నారు. దోమకొండ మండలాన్ని క్రీడల్లో ముందుంచాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, వైస్ ఎంపీపీ పుట్ట బాపురెడ్డి, విండో చైర్మన్ నాగరాజురెడ్డి, సీడీసీ చైర్మన్ ఐరేణి నరసయ్య, సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్, కుంచాల శేఖర్, ఎస్ఐ సుధాకర్, స్వామిగౌడ్ లక్ష్మణ్, షమ్మీ సాయిలు, పీడీ నరసింహారెడ్డి, నిమ్మ శంకర్, దోర్నాల లక్ష్మణ్, ఆసంశెట్టి పోచయ్య, ఎంపీఓ తిరుపతిరెడ్డి, సిద్ధ రాములు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సీఎం కప్ క్రీడా పోటీలు

పిట్లం : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించిన కబడ్డీ, షాట్‌పుట్, వాలీబాల్ విభాగాలలో పోటీలు నిర్వహించారు. వాలీబాల్ పోటీల్లో మండల కేంద్రానికి చెందిన ఇమ్రాన్ జట్టు గెలుపొందగా కబడ్డీలో తిమ్మానగర్ గ్రామ జట్టు విజేతగా నిలిచింది. షాట్‌పుట్ విభాగంలో బత్తిని ప్రశాంత్ కైవసం చేసుకున్నాడు. కాగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో క్రీడల్లో గెలుపొందిన వారికి ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీఓ బ్రహ్మం, ఎంఈఓ దేవిసింగ్, నాయకులు విజయ్, పండరి పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడల్లో గెలిచిన వారికి మెమోంటోలు, సర్టిఫికెట్‌లు అందజేత

సదాశివనగర్ : మండల స్థాయిలో సీఎం కప్ క్రీడలలో భాగంగా జరిగిన పోటీలలో గెలుపొందిన వారికి మెమెంటోలు, ప్రశంసాపత్రాలను, మెడల్స్‌ను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గైని అనుసూయ, జడ్పీటీసీ, కమిలి నర్సింలు, మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లం సాయిరెడ్డి, వైఎస్ చైర్మన్ వడ్ల రాజేందర్, సదాశివనగర్ సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మి, ఎంపీఓ నరేందర్‌రెడ్డి వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యలు

నవతెలంగాణ-మెండోర

సీజనల్ వ్యాధులు విష జ్వరాలు ప్రభలే అవకాశం ఉన్నందున సావెల్ గ్రామంలో సర్పంచ్ నేల లావణ్య లింగన్న ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

ఈ సందర్భంగా సర్పంచ్ గ్రామంలో పర్యవేక్షించి గ్రామపంచాయతీ కార్మికులతో గ్రామంలో పారిశుధ్య పనులు ప్రారంభించి నివాస గృహాల మధ్యలో ఉన్న మురికి కాలువలు శుభ్రం చేసి పూడికలు తొలగించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. ఈనెల 17నుండి 23 వరకు జరుగు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. రాబోవు వర్షాకాలం సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యలు చేపట్టామని అన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలి దోమలవల్ల డెంగ్యూ కేసులు పెరగకుండా మరో వైపు నీరు కలుషితం అవుతున్న నేపథ్యంలో టైఫాయిడ్ కేసులు కూడ పెరిగి డెంగ్యూ , మలేరియా వ్యాధుల బారిన పడి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొనకుండా దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నేల్ల పోశెట్టి, వార్డు సభ్యులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలం గాణ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజర్ చేయాలని డిమాండ్ చేశారు.బుదవారం తెలంగాణ యూనివర్సిటీ లోని మెయిన్ క్యాంపస్ లో అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు వి దత్తాహరి మాట్లాడుతూ.. సౌత్ క్యాంపస్, బీఈడీ కళాశాల క్యాంపస్, మెయిన్ క్యాంపస్‌లో ఉమ్మడిగా సమావేశమై ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ,రాష్ట్రంలో 12 యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సి పి వెంటనే రెగ్యులరైజ్ చేయాలని అన్నారు. గురువారం రాష్ట్రం లోని అన్ని యూనివర్సిటీలకు సంబంధించిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉస్మానియా యూనివర్సిటీలో ఒక వినూత్న కార్యక్రమాన్ని చేపడుతున్నారని తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఉన్న కాంట్రాక్టు అధ్యాపకులు తెలంగాణ యూనివర్సిటీలో వినూత్న కార్యక్రమం చేస్తామని డాక్టర్ వి దత్తా హరి వివరించారు.

రమణ చారిని కలిసిన తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యులు



రమణాచారిని కలిసిన పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఇందూరు జిల్లా అధ్యక్షులు భూపతి రావు, నగర అధ్యక్షులు కిరణ్ దేశ్ ముఖ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బొగ్గుల కుంటలో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ కార్యాలయంలో బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రమణచారిని మర్యాద పూర్వకంగా బుధవారం కలిశారు. ఈ నెల 31న హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి కెసిఆర్ చేతుల మీదుగా బ్రాహ్మణ భవనం సదనం ప్రారంభోత్సవం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమనికి పెద్ద ఎత్తున బ్రాహ్మణ బంధువులు రావాలని రమణచారి సూచించారని తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్‌లో బ్రాహ్మణ భవనానికి నిధులు కేటాయించాలని, అర్హులైన పేద బ్రాహ్మణులకు బెస్ట్ స్కీమ్ కింద ఆర్థిక సహాయం చేయాలని రమణ చారికి విజ్ఞప్తి చేశారు. ఈనెల 31న నిజామాబాద్ జిల్లా నుండి బ్రాహ్మణ బంధువులు హైదరాబాద్‌లో బ్రాహ్మణ భవన ప్రారంభోత్సవనికి బ్రాహ్మణ బంధువులు పెద్ద ఎత్తునా రావాలని కోరారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంగం ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ రొట్టె సభ్యులు ప్రకాష్ కులకర్ణి లక్ష్మి నారాయణ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను కేసీఆర్ నిలబెట్టుకోవాలి

- టీడీపీ రాష్ట్ర నాయకులు హలీం మస్కతి

నవతెలంగాణ-ఆర్మూర్


ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికలలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని టిడిపి రాష్ట్ర నాయకులు హలీం మస్కతి అన్నారు. నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పార్లమెంట్ నియోజక వర్గం మినీ మహానాడు వేడుకలు పట్టణంలోని పెర్కిట్ ఎంఆర్ గార్డెన్‌లో బుధవారం నిర్వహించారు. పార్లమెంట్ కోఆర్డినేటర్, నియోజకవర్గ ఇంఛార్జి దేగాం యదాగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మార్ గార్డెన్ నుండి ర్యాలీగా వెళ్లి మైపాల్ రెడ్డి విగ్రహానికి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి పలు తీర్మానాలు చేశారు. ఎన్టీఆర్‌కు భారత రత్న అవార్డు ఇవ్వాలని కోరారు. ఆర్మూర్ ప్రాంత రైతులకు, పసుపు బోర్డు ఇవ్వాలని కోరుతూ పసుపునకు మద్దతు ధర ఇవ్వాలని,

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లెదర్ పార్కు ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. జక్రాన్‌పల్లి ఏరియాలో ఎయిర్ పోర్టు నిర్మించి నిరుద్యోగ సమస్యను కొంతవరకు తగ్గించాలని, బోధన్‌లో ఉన్న షుగర్ ఫ్యాక్టరీ లను తెరిపించాలని తెలపారు. అకాల వర్షాలకు తడిసిపోయిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే తక్షణమే కొనాలని, తెలంగాణ లో మహిళపై జరుగుతున్న అగాయిత్యలను దృష్టిలో ఉంచుకొని మహిళల భద్రతకు పెద్ద పీట వేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రశ్న పత్రాలు లీకేజీలను ఖండిస్తు తిరిగి అలాంటివి పునరా వృతం కావద్దని తెలిపారు. పూర్తి కాని సాగునీటి ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేయాలని కోరారు. రాష్ట్రాన్ని ఐటి రంగంలో ప్రపంచంతో పోటీపడేటట్లు చేసిన ఘనత చంద్రబాబు నాయుడుదని అన్నారు. కార్యక్రమంలో యువ నాయకులు ఫెరోజ్ ఆధ్వర్యంలో మైనార్టీ నాయకులు పార్టీలో చేరారు. అలిం మస్కతి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ కోఆర్డినేటర్ వినోద్ కుమార్, కోరుట్ల నియోజక వర్గం కోఆర్డినేటర్ మనుక ప్రవీణ్, జగిత్యాల నియోజకవర్గం మహంకాళి రాజన్న, సంధ్య పోగు రాజశేఖర్, విఠల్, పార్లమెంట్ ముఖ్య నాయకులు రెంజర్ల సురేష్, హనుమంత్ రావు, పావులూరి వెంకటేశ్వర రావు, అనుబంధ సంఘల నాయకులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న నాయకులు

సిద్ధ రామేశ్వరం ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని దక్షిణ కాశీ శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయంలో బుధవారం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం గణపతి హెూమము, నవగ్రహ హెూమము, చండీ హెూమము, మృత్యుంజయ హెూమము, సంజీవని హెూమము, సక్యత హెూమము, శత రుద్రము, శత శెండీ పారాయణం అలాగే రుద్రాభిషేకం, పంచ ద్రవ్యాలతో సుగంధ ద్రవ్యాలతో శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయ స్వయంభులింగ మహా క్షేత్ర ఆలయంలో ఉన్న లింగంను ఘనంగా అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందే మహేందర్ రెడ్డి, పట్టణ సర్పంచ్ తునికి వేణు, జడ్పిటిసి పద్మ నాగభూషణం గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి ఆలయ ఈవో శ్రీధర్, ఆలయ డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, భక్తులు, ఆలయ అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

'మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్' పథకంతో అత్యధిక వడ్డీ

నవతెలంగాణ-సిరికొండ

కేంద్ర ప్రభుత్వం 2023-24 కేంద్ర బడ్జెట్లో దేశంలోని నారీ శక్తి కోసం మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికేట్, 2023 పథకం ప్రకటించిందని, ఈ పథకం అత్యధిక వడ్డీ అందిస్తుందని నిజామాబాద్ సౌత్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ పోస్ట్స్ వి. సంతోష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు, ఆడపిల్లలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన కొత్త పథకం మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికేట్ అని పేర్కొన్నారు.

18 సంవత్సరాలు నిండిన మహిళలు మైనర్ ఆడపిల్లల పేరు మీద సంరక్షకులు ఈ ఖాతాను ప్రారంభించవచ్చు. ఈ ఖాతాలో కనిష్ఠంగా వెయ్యి రూపాయలు గరిష్ఠంగా రెండు లక్షల రూపాయల వరకు జమ చేయవచ్చని తెలిపారు. గరిష్ఠ విలువ దాటకుండా ప్రతి 3 నెలల వ్యవధితో ఎన్ని ఖాతలైన ప్రారంభించవచ్చని, ఈ పథకంలో 7.5శాతం వడ్డీ రేటు ప్రతి సంవత్సరం లభిస్తుందని, ఖాతా కాల వ్యవధి తరువాత 40 శాతం వరకు పాక్షికంగా ఉపసంహరణ చేసుకొనే సౌకర్యం కూడా కలదని పేర్కొన్నారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఆరు నెలల తరువాత 5.5 శాతం వడ్డీతో ఖాతాను ఎప్పుడైన క్లోజ్ చేసుకోవచ్చని, ఈ పథకం మొదలై ఒక్క నెలలోనే నిజామాబాద్ జిల్లాలో రెండువేల ఖాతాలు తెరవడం జరిగిందని తెలిపారు. రెండు సంవత్సరాల కాలవ్యవధి ఫిక్స్ డిపాజిట్‌కి మరి ఏ ఇతర బ్యాంక్ ,సంస్థ కంటే ఎక్కువ వడ్డీ పోస్ట్ ఆఫీస్ అందిస్తుందని, చాలా మహిళలు మహిళ సమ్మాన్ ఖాతా లను తెరుస్తున్నారని తెలిపారు. ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, మూడు ఫోటోలు మీ దగ్గరలోని హెడ్ పోస్టాఫీసు,సబ్ పోస్టాఫీసు, బ్రాంచ్ పోస్టాఫీసు లలో ఎక్కడైనా ఈ ఖాతాను ప్రారంభించవచ్చని కోరారు.

